7

సాక్షి కామారెడ్డి

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



చిచ్చు పెట్టిన ఇసుక వివాదం

ప్రశాంత వాతావరణం ఉండే బిచ్కుంద మండలంలోని శెట్లూర్ గ్రామంలో ఇసుక వివాదం గ్రామస్తుల మధ్య చిచ్చుపెట్టింది.

- 9లో ▸



నిలిచిన 'జీపీ' పనులు

రాజంపేట మండలంలోని ఆరేపల్లి, నడిమితండా గ్రామాలలో పంచాయతీ భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.6 /17.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. అక్కడక్కడ మబ్బులు ఏర్పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: విదేశీ విద్యా విధానం అధ్యయనం కోసం ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సింగపూర్, ఫిన్లాండ్, వియత్నాం, జపాన్ దేశాలలో విద్యా విధానం అధ్యయనం కోసం వెళ్లడానికి అనుభవం, అర్హతలు ఉన్న హెచ్ఎంలు, ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, మోడల్ స్కూల్, టీజీఆర్ఈఐఎస్‌లలో 10 ఏళ్ల బోధన అనుభవం, 55 ఏళ్ల వయస్సులోపు, వాలిడ్ పాస్‌పోర్టు కలిగిన ఉపాధ్యాయులు అర్హులన్నారు. కలెక్టర్, జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో ఎంపిక ఉంటుందన్నారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా, పాఠ్య పుస్తక రచన అనుభవం, వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం వంటి అనుభవం కలిగిన వారు రుజువులతోపాటు, దరఖాస్తులను ఈ నెల 14న సాయంత్రం 4 గంటల లోపు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

మద్యం దుకాణాలకు 106 దరఖాస్తులు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి జిల్లాలోని మద్యం దుకాణాలకు గాను శనివారం నాటికి 106 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంత రావు తెలిపారు. జిల్లాలో మొత్తం 49 దుకాణాలుండగా 5 ఎస్సీ, 2 ఎస్టీ, 7 గౌడ సామాజిక వర్గాలకు కేటాయించారు. ఓపెన్ కేటగిరి కింద 35 దుకాణాలున్నాయి. ఈ నెల 18 వరకు కొత్త టెండర్లకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఈ నెల 23న లక్కీ డ్రా నిర్వహిస్తామని పేర్కొన్నారు. శనివారం వచ్చిన 18 దరఖాస్తులతో కలిపి ఇప్పటి వరకు ఆయా దుకాణాలకు 106 దరఖాస్తులు వచ్చాయని ఈఎస్ తెలిపారు. వాటిలో కామారెడ్డి స్టేషన్ పరిధిలో 15 దుకాణాలకు 27 దరఖాస్తులు వచ్చాయని, ఎల్లారెడ్డి స్టేషన్ పరిధిలో 7 దుకాణాలకు 10 దరఖాస్తులు, బాన్సువాడ స్టేషన్ పరిధిలో 9 దుకాణాలకు 28 దరాఖాస్తులు, దోమకొండ స్టేషన్ పరిధిలో 8 దుకాణాలకు 13 దరఖాస్తులు, బిచ్కుంద స్టేషన్ పరిధిలో 10 దుకాణాలకు 28 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: ఆరోగ్యశ్రీ పథకంలో విధులు నిర్వహిస్తున్న తమను అర్ధంతరంగా తొలగించడం సరికాదని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆరోగ్యశ్రీ పథకం కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం కామారెడ్డి జీజీహెచ్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో 10 ఏళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న తమను ఆరోగ్యశ్రీలో నిధులు లేవని అసత్యపు కారణంతో ఉద్యోగాల నుంచి తొలగించడం సిగ్గుచేటన్నారు. దీంతో 13 మంది ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి ఆన్‌లైన్ సేవలు పూర్తిస్థాయిలో జరగడం లేవన్నారు. తక్షణమే తమను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ అన్యాయంపై ఉన్నతాధికారులను కలుస్తామని, అవసరం అయితే కోర్టుకు కూడా వెళ్తామని తెలిపారు. ఇమ్రాన్, గౌతమ్, అమీన్, సాయికుమార్, నర్సింలు, హరికుమార్, స్వరూప, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సాధారణంగా ఒక ఊరి పేరు రెండుమూడు గ్రామాలకు ఉంటున్నాయి. దీంతో ఫలానా ఊరని ఎవరైన చెబితే ఎక్కడ ఉందో తెలుసుకోవడం కొంత కష్టమే. అలాకాకుండా ఊరి పేరుతో పాటు పక్క ఊరి పేరు, లేదా సమీపంలోని ప్రధానమైన ఊరి పేరును కలిపి చెబితే సులువుగా ఎక్కడ ఉందో అర్థమవుతుంది. ఇలా జిల్లాలోని పలు గ్రామాలను దశాబ్దాలుగా ఊరి పేరుతోపాటు పక్క ఊరి పేరును జత చేసి పిలుస్తుంటారు. అలాంటి ఊర్ల పేర్లపై సండే స్పెషల్ స్టోరీ...

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

ఆర్గొండ కంచుమల్ కొండాపూర్..

సండే స్పెషల్

ఊరి పేర్లకు జతగా పక్క ఊరి పేరు

- అలా పిలిస్తేనే సులువుగా తెలుస్తుందంటున్న గ్రామస్తులు
- దశాబ్దాలుగా కొనసాగుతున్న వైనం

'తాతా.. ఏ ఊరే మీది..
మాది ఆర్గొండ కొండాపూర్'
'అవ్వా ఏ ఊరుకు పోవాలె..
శాబ్దిపూర్ గూడెంకు బిడ్డా'
'ఏ ఊరమ్మ మీది.. మాటూర్ మాసన్‌పల్లి'

'మీదేవూరు తమ్మీ.. కంచుమల్ కొండాపూర్'.... జిల్లాలో కొన్ని ఊర్ల పేర్లకు జతగా పొరుగూరు పేరును కలిపి పిలుస్తారు. అట్లా పిలిస్తేనే సులువుగా వాళ్లది ఆ ఊరు అని అర్థమవుతుంది. దశాబ్దాల కాలంగా అలాగే పిలుస్తుంటారు. పాతతరం వాళ్లే కాదు ఇప్పటివాళ్లు కూడా వాళ్ల ఊరు పేరు అడిగితే కూడా జతగానే చెబుతారు. అలా చెబితేనే అందరికీ సులువుగా అర్థమవుతుంది.

ఒక పేరుతో నాలుగైదు గ్రామాలు...

కొన్ని గ్రామాల పేర్లతో నాలుగైదు గ్రామాలున్నాయి. కొండాపూర్ అనే పేరుతో కామారెడ్డి జిల్లాలోనే ఐదారు గ్రామాలుంటాయి. దీంతో ఆ ఊరు పేరు చెబితే ఎవరైన మళ్లీ ఎక్కడ అని అడుగుతారు. జతగా పక్క ఊరు పేరు కలిపి చెబితే ఆ ఊరా అని అర్థం చేసుకుంటారు. రాజంపేట మండలంలో కొండాపూర్ అనే ఊరు, ఆర్గొండ ఊరు పక్కనే ఉంటుంది. దీంతో చాలా మంది ఆర్గొండ కొండాపూర్ అంటారు. రికార్డుల్లో కొండాపూర్ అని మాత్రమే ఉంటుంది. కానీ ఊరు పేరు త్వరగా అర్థం చేసుకునేలా 'ఆర్గొండ కొండాపూర్' అంటారు. అలాగే లింగంపేట మండలంలో కొండాపూర్ ఉంది. దాని పక్కనే కంచుమల్ అనే ఊరుంటుంది. ఇక్కడ కొండాపూర్‌ను 'కంచుమల్ కొండాపూర్' అని పిలుస్తుంటారు.

అలాగే నాగిరెడ్డిపేట మండలంలో మాసాన్‌పల్లి అనే ఊరుంది. దాని పక్కనే మాటూర్ ఉంటుంది. దీంతో ఆ ఊరి పేరును 'మాటూర్ మాసాన్‌పల్లి' అని పిలుస్తారు. ఇదే మండలంలో వాడి అనే ఊరుంటుంది. దాని పక్కన చీనూర్ అనే ఊరు ఉంటుంది. దీంతో వాడి ఊరు పేరు చెప్పడానికి 'చీనూర్ వాడి' అంటారు. కామారెడ్డి మండలంలో గూడెం అనే ఊరుంటుంది. దానికి ముందే శాబ్దిపూర్ అనే ఊరుంది. ఇక్కడ గూడెం పేరును 'శాబ్దిపూర్ గూడెం' అంటారు. తాడ్వాయి మండలంలో సంతాయిపేట ఊరు, చిట్యాల ఊరు పక్కనే ఉంటుంది. దాన్ని చిట్యాల సంతాయిపేట అని పిలుస్తారు. ఇదే మండలంలో కన్కల్ అనే ఊరుకు ముందు దేమె అనే ఊరుంటుంది. ఇక్కడ ఊరి పేరును దేమె కన్కల్ అంటారు. రామారెడ్డి మండలంలో మద్దికుంట అనే ఊరుంటుంది. పక్కనే రెడ్డిపేట ఉంటుంది. చాలా మంది రెడ్డిపేట మద్దికుంట అంటుంటారు. పొరుగునే నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలో కొండాపూర్ ఉంటుంది. దాని పక్కనే తూంపల్లి అనే ఊరుంది. చాలా మంది తూంపల్లి కొండాపూర్ అంటారు. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ (ఎం) గ్రామాన్ని మాచారెడ్డి ఘన్‌పూర్ అంటుంటే, రామారెడ్డి మండలంలోని ఘన్‌పూర్(ఆర్)ను రెడ్డిపేట ఘన్‌పూర్ అంటారు. కామారెడ్డి మండలంలో తిమ్మక్‌పల్లి పేరుతో రెండు గ్రామాలున్నాయి. గర్గుల్‌కు సమీపంలో ఉన్న తిమ్మక్‌పల్లి గ్రామాన్ని గర్గుల్ తిమ్మక్‌పల్లి అంటారు. వాస్తవంగా తిమ్మక్‌పల్లి గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటుంది. తిమ్మక్‌పల్లి(జి) అని కూడా అంటుంటారు. అలాగే మరో తిమ్మక్‌పల్లిని తిమ్మక్‌పల్లి (కే) అంటారు. కామారెడ్డి తిమ్మక్‌పల్లి అని చెబుతారు. ఇలా ఊరు పక్కన ఉన్న ఊరు పేరుతో కలిపి పిలవడం వల్ల ఆ ఊరు ఎక్కడుంటుందో తెలిసిపోతుంది.

అట్ల పిలిస్తేనే జెల్దీ తెల్సిపోతుంది..



మా ఊరు కొండాపూర్. కొండాపూర్ అంటే ఏ కొండాపూర్ అని, ఎక్కడుంటది అని అడిగేవాళ్లుంటారు. అందుకే ఆర్గొండ కొండాపూర్ అని చెబుతుంటాం. మా ఊరు వాళ్లే కాదు. పొరుగూళ్ల వాళ్లు కూడా ఆర్గొండ కొండాపూర్ అనే పిలుస్తారు. ఇట్లా పిల్వడం వలన సులువుగా అర్థమవుతుంది.

– గొల్ల లచ్చయ్య, కొండాపూర్, రాజంపేట మండలం

రెండూళ్ల పేర్లతోనే పిలుస్తరు..



మాది నాగిరెడ్డిపేట మండలంలోని మాసాన్‌పల్లి. మా ఊరు పక్కన మాటూర్ ఉంటుంది. మొదటి నుంచి మాటూర్ మాసాన్‌పల్లి అని పలుకుతారు. మాసాన్‌పల్లి పంచాయతీలో మాటూర్ ఉండేది. ఆ మధ్యనే మాటూర్ వేరు పంచాయతీగా ఏర్పాటైంది. రెండూళ్ల పేర్లను తాతల కాలం నుంచి కలిసే పిలుస్తుంటారు.

– బండారి బాబాగౌడ్, మాసాన్‌పల్లి, నాగిరెడ్డిపేట మండలం

ఒక్క పేరుతో ఎన్నో ఊర్లు..




మా ఊరు లింగంపేట మండలంలోని కొండాపూర్. మా ఊరు పేరుతో జిల్లాలో, పక్క జిల్లాలో కూడా ఉన్నాయి. మా ఊరుకు పక్కనే కంచుమల్ ఉంది. అందుకే కంచుమల్ కొండాపూర్ అనే పేరు వాడుకలో ఉంది. వేర్వేరు గ్రామాలు, వేర్వేరు పంచాయతీలు అయినా సులువుగా తెలిసేలా పిలుస్తారు.

– బట్టు కాశీరాం, కొండాపూర్, లింగంపేట మండలం

ఆర్టీసీ డ్రైవర్లకు మొబైల్ నిషేధం

- కామారెడ్డి డిపోలో అమలవుతున్న విధానం
- విధులకు ముందే ఫోన్ల డిపాజిట్
- ప్రమాదాల నివారణకు కృషి



ఖలీల్‌వాడి: తెలంగాణ ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకునేందుకు వివిధ మార్గాలను అన్వేషిస్తూనే.. మరోవైపు ప్రయాణికుల మన్ననలను పొందేందుకు అన్నిరకాల అవకాశాలను ఉపయోగించుకుంటోంది. ఆర్టీసీ ప్రమాదాల నివారణకు ఇటీవల డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని తాజాగా బస్సు డ్రైవర్లకు సెల్‌ఫోన్ వాడకం నిషేధించింది. ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 11 రీజియన్ల నుంచి ఒక్కో డిపోను పైలట్ ప్రాజెక్టు కింద తీసుకుంది. ఉమ్మడి నిజామాబాద్ నుంచి కామారెడ్డి డిపోలో ఈ విధానం అమలు చేస్తోంది. ఈ మేరకు డిపోలోని డ్రైవర్లు సెల్‌ఫోన్ లేకుండా బస్సుల్లో విధులు నిర్వహిస్తున్నారు. డ్రైవింగ్ సీటులోకి వెళ్లే ముందు డ్రైవర్లు అంతా తమ సెల్‌ఫోన్లను డిపో సెక్యూరిటీకి అందజేస్తున్నారు. గతంలో పలువురు డ్రైవర్లు విధుల్లో సెల్‌ఫోన్ వినియోగిస్తున్నట్లు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం సఫలీకృతమైతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లో అమలు చేయనున్నట్లు సమాచారం.

నిజామాబాద్ రీజియన్‌లో డిపోలు	6
పనిచేస్తున్న డ్రైవర్లు	795


సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా..

సురక్షితమైన ప్రయాణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇంత కాలం జరిగిన ప్రమాదాలకు కారణాలను విశ్లేషిస్తూనే మరోసారి జరగకుండా చర్యలు చేపడుతున్నాం. ఈ విధానంలో ఏమైనా మార్పులు, సమస్యలుంటే తొలుత గుర్తిస్తాం. దశల వారీగా అన్ని డిపోల్లో అమలు చేస్తాం.

– జ్యోత్స్న, ఆర్ఎం, నిజామాబాద్ రీజియన్

'కౌలాస్'కు రికార్డుస్థాయి వరద

- పదిహేనేళ్లలో మొదటిసారి ఇన్‌ఫ్లోగా 9.75 టీఎంసీల నీరు
- అవుట్‌ఫ్లో 9.135 టీఎంసీలు



కౌలాస్ ప్రాజెక్టు గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

నిజాంసాగర్(జుక్కల్): జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న కౌలాస్ ప్రాజెక్టు పదిహేనేళ్లల్లో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చింది. 2011 సంవత్సరం నుంచి కౌలాస్ ప్రాజెక్టు రికార్డుల ప్రకారంగా ఈ యేడాది అత్యధికంగా 9.75 టీఎంసీల వరద నీరు ఇన్‌ఫ్లో రాగా 9.135 టీఎంసీల నీటిని వరద గేట్ల ద్వారా దిగువనకు విడుదల చేశారు.

ఆగస్టులో అత్యధిక ఇన్‌ఫ్లో..

కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కుండపోతగా కురిసిన వర్షాలకు ఈ యేడాది ఆగస్టు 28న కౌలాస్ ప్రాజెక్టులోకి అత్యధికంగా 31,456 క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కౌలాస్ ప్రాజెక్టు చరిత్రలో 30 వేలకు పైగా క్యూసెక్కుల వరద నీరు ఒక్కరోజులో రావడం రికార్డు అని అధికారులు పేర్కొంటున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురవడంతో ఆగస్టు 17 నుంచి కౌలాస్ ప్రాజెక్టు గేట్ల ద్వారా మంజీరా నదిలోకి నీటి విడుదల కొనసాగుతుంది. యాభై రోజుల నుంచి కౌలాస్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడంతో ఇప్పటి వరకు 9.135 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల నుంచి కౌలాస్ ప్రాజెక్టులోకి 287 క్యూసెక్కుల వరద నీరు శనివారం ఇన్‌ఫ్లోగా వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయినీటిమట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీల)కు గాను ప్రస్తుతం 457.98 మీటర్లు (1.232 టీఎంసీల) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

బంగారంపైనే దొంగల నజర్

పది రోజుల క్రితం సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామంలోని నాలుగిళ్లలో ఒకే రోజు చోరీ జరిగింది. తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి చొరబడిన దొంగలు అందినకాడికి బంగారం, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు.

గత నెల 19న బాన్సువాడ మండలం తెల్లాపూర్ గ్రామానికి చెందిన మేడిపల్లి లక్ష్మీ అనే మహిళను బెదిరించి ఆమె వద్దనున్న అర తులం బంగారం, రూ.50 వేలను దుండగుడు దోచుకెళ్లాడు.

జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో ఇటీవల రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలి మెడలోంచి 3 తులాల బంగారం గొలుసును లాక్కుని పరారయ్యారు. రెండు రోజుల తర్వాత పోలీసులు వారిని పట్టుకున్నారు.



జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో రెండు రోజుల క్రితం దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. శ్రీశైలం అనే వ్యక్తి ఇంటికి తాళం ఉండటంతో, దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి 3.5 తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదు దోచుకెళ్లారు. పక్కనే ఉన్న మరో ఇంటి తాళం కూడా పగులగొట్టి చోరీకి యత్నించారు.

- ధరలు పెరుగుతుండటంతో వాటి చోరీకే ప్రాధాన్యం
- తాళం వేసిన ఇండ్లు, ఒంటరిగా కనిపించే మహిళలే టార్గెట్
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: బంగారం ధరలు ఆకాశాన్నంటుతుండగా, వెండి భూమ్మీద ఉండనంటోంది. దీంతో ప్రస్తుతం చాలా మంది సామాన్య ప్రజలు వాటిని కొనుగోలు చేయడానికి ఆర్థికంగా నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి తరుణంలో బంగారం గనుక చోరీకి గురైతే పెద్ద షాక్ తగిలినట్లే. ధరలు భారీగా పెరిగిన వేళ దొంగల నజర్ బంగారం, వెండిపై మరింతగా పెరగడం కూడా సహజమే. తాళం వేసిన ఇండ్లు, ఒంటరిగా కనిపించే మహిళలను టార్గెట్ చేస్తూ నేరాలకు పాల్పడుతున్న పలు ఘటనలు ఇటీవల జిల్లాలో వెలుగుచూడటమే ఇందుకు ఉదాహరణ. కాబట్టి ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం కనిపిస్తుంది.

చైన్ స్నాచింగ్‌కు గురికాకుండా..

ఒంటరిగా ఉండి, ప్రయాణించే మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఒంటిపై ఉన్న బంగారాన్ని కాజేసేందుకు సైతం దుండగులు వెనకాడటం లేదు. ప్రయాణాల్లో మహిళలు తమ విలువైన బంగారు ఆభరణాలను బయటకు కనిపించకుండా జాగ్రత్త పడాల్సిన పరిస్థితులున్నాయి. మహిళా ప్రయాణికుల వద్ద నుంచి పర్సులు, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యే ఘటనలు తరచు వెలుగుచూస్తున్నాయి. చోరీల నియంత్రణకు పోలీసు శాఖ అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించినప్పుడే దొంగతనాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని పోలీసులు కోరుతున్నారు.



గాంధారిలో బంగారం చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

ఊరెళ్తే జాగ్రత్త..

బంగారాన్ని కొనడానికి కష్టపడినట్లే దాన్ని కాపాడుకోవడానికి తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఇప్పుడు తులం బంగారమే దాదాపు రూ.1.24 లక్షలుగా ఉంది. దీంతో దుండగులు గోల్డ్ చోరీలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. కాబట్టి ఇంటికి తాళం వేసి ఊర్లెళ్లే వారు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇంట్లో బంగారం, నగదు ఉంచి, కొద్దిసేపటికే వస్తాం కదా అనే నిర్లక్ష్య ధోరణిలో బయటకు వెళ్తున్నారు. గతంలో ఇంట్లో దొంగలు పడితే చాలా రకాల వస్తువులు దోచుకువెళ్లేవారు. కొంతకాలంగా కేవలం బంగారం, వెండి, నగదు మాత్రమే చోరీ చేస్తున్నారు. తిరిగి వచ్చేసరికి అవన్నీ దొంగలపాలవుతున్న ఘటనలు సైతం చోటుచేసుకుంటున్నాయి. అందుకే ఊర్లకు వెళ్లే వారు ఇంట్లో బంగారం, నగదు ఉంచకూడదనీ, బ్యాంకులో గానీ, దగ్గరి బంధువుల వద్దగాని పెట్టుకొని వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఇళ్లలో విలువైన వస్తువులు ఉంచరాదు..



దొంగతనాల విషయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎవరైన ఇంటికి తాళం వేసి ఊర్లెళ్తే బంగారం, నగదు లాంటి విలువైన వస్తువులు ఇళ్లలో ఉంచకూడదు. పోలీసు శాఖ సూచనలు పాటించాలి. ఎవరైనా కాలనీల్లో అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే స్థానిక పోలీసులకు గానీ, డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలి. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. నేరాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– రాజేష్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి

ప్రతీ హిందువు ఆర్ఎస్ఎస్‌లో భాగస్వాములు కావాలి

- విద్యాభారతి దక్షిణ మధ్య కార్యదర్శి అయాశిస్సుల లక్ష్మణ్‌రావు
- బాన్సువాడలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం



బాన్సువాడ ప్రభుత్వ కళాశాల మైదానంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలకు హాజరైన స్వయం సేవకులు

బాన్సువాడ: ప్రతీ హిందువు ఆర్ఎస్ఎస్‌లో భాగస్వాములు కావాలని విద్యాభారతి దక్షిణ మధ్య కార్యదర్శి అయాశిస్సుల లక్ష్మణ్‌రావు అన్నారు. ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఇందులోభాగంగా పట్టణంలో భారీ సంఖ్యలో స్వయం సేవకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల మైదానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి హిందువు సమాజ సేవ చేయాలని, సంఘటితంగా ఉండాలన్నారు. కులం, వర్గాలను దూరం పెట్టాలని సూచించారు. హిందుత్వం కోసం పాటు పడాలని పేర్కొన్నారు. కుటుంబం, స్వదేశీ, పౌర కర్తవ్యం తదితర అంశాలపై మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు సత్యనారాయణ, రాంరెడ్డి, వెంకట్రావ్, రవీంద్రనాథ్‌ఆర్య, నాగులగామ వెంకన్న, నాగిరెడ్డి, బీజేపీ నాయకులు పైడిమల్ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, కోనాల గంగారెడ్డి, శ్రీనివాస్, చిరంజీవి, చీకట్ల రాజు, గంగారం, శంకర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, నాగరాజు, దత్తు, సాయిబాబా, సాయిరెడ్డి, లక్ష్మణ్, విఠల్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

క్లుప్తంగా

పొలాల్లో ఇసుక మేటలు తొలగించాలి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల పరిధిలో పంట పొలాల్లో పేరుకు పోయిన ఇసుకను తొలగించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లోకి వరద నీరు భారీగా రావడంతో పంటలు నీట మునిగి ఇసుక పేరుకు పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక మేటలను తొలగించి నష్ట పరిహారం అందించాలని వారు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీద్‌పేట–వాడి గ్రామాల మధ్య రోడ్డు పక్కన ఉన్న పాడు బడిన వ్యవసాయబావితో ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు పక్కనే బావి ముళ్ల పొదల మధ్య ఉండటంతో వాహనదారులు ఆ ప్రాంతం మీదుగా వెళ్లేందుకు జంకుతున్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే ప్రమాదవశాత్తు ఆ బావిలో పడిపోయే అవకాశాలున్నాయి. బావి ఉందనే ఎలాంటి సూచిక బోర్డు కూడా లేదు. వెంటనే అధికారులు చర్యలు తీసుకుని పాడు బడిని ఈ వ్యవసాయ బావిని పూడ్చివేయించాలని ప్రజలు కోరుతున్నారు.

చిరుత సంచారం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కంచుమల్, సీతాయిపల్లి రోడ్డుపై చిరుత సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. గత రెండు రోజులుగా రాత్రి వేళ కంచుమల్ నుంచి సీతాయిపల్లి వెళ్తున్న ప్రయాణికులకు రోడ్డుపై చిరుతపులి పరుగులు తీస్తూ కనిపించినట్లు పేర్కొన్నారు. దీంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రాత్రి వేళ, మధ్యాహ్నం రోడ్డుపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకు మొండిచేయి

- పదవీ కాలం పూర్తయినా దక్కని నజరానా
- నిధుల విడుదలను పట్టించుకోని గత ప్రభుత్వం



మోపాల్ మండలంలోని తాడెం జీపీ కార్యాలయం

మోపాల్: గ్రామాభివృద్ధిని కాంక్షించి పంచాయతీలను ఏకగ్రీవం చేసిన గ్రామాలకు మొండిచేయే దక్కింది. ఎన్నికలు లేకుండా ఆదర్శంగా నిలిచిన జీపీలు పాలకుల వ్యవహారంతో అన్యాయానికి గురయ్యాయి. ఐదేళ్ల పదవీకాలం పూర్తయినా ఆదర్శ గ్రామపంచాయతీలకు నజరానా నేటికి అందలేదు. రూ.10 లక్షలను ప్రభుత్వం, మరో రూ.15లక్షలు ఎమ్మెల్యే, ఎంపీల నిధుల నుంచి కేటాయిస్తామని ప్రకటించారు. ఆ నిధులు విడుదలైతే గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామనుకున్న వీరి ఆశలు అడియాశలయ్యాయి. 2019 ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 530 (ప్రస్తుతం 542 జీపీలు) గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఎన్నికల్లో 130 జీపీల్లో సర్పంచ్, వార్డుసభ్యులందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలు జరగకుండా సర్పంచ్ సహా పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంటే తమ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.10లక్షలు, ఎంపీ, ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.15లక్షలు కేటాయిస్తామని ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కానీ పదవీకాలం పూర్తయి ఏడాదిన్నర దాటినా.. మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నా.. ప్రోత్సాహకం కింద ఇస్తామన్న డబ్బులు రాకపోవడంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలంటే ఆషామాషీ కాదు

పంచాయతీ ఎన్నికల వేళ ఆశావహుల మధ్య తీవ్ర పోటీ ఉంటుంది. అప్పటి వరకు మిత్రులుగా ఉన్న వారు రాజకీయ శత్రువులుగా, పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థితిలో ఉన్న వారు దోస్త్ మేరా దోస్త్ అనేలా సమీకరణాలు మారిపోతుంటాయి. ఎమ్మెల్యే, ఎంపీ గెలవడం కన్నా.. సర్పంచ్ కావడం ఎంతో కష్టమని సీనియర్ మంత్రి, ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఓ సందర్భంలో ప్రస్తావించారు. ఇంతటి సందడి ఉండే ఎన్నికలను ఏకగ్రీవం పేరుతో ఆదర్శంగా నిలిచిన గ్రామాలకు తగిన ప్రోత్సాహం అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ మొత్తాన్ని రూ.50వేల నుంచి రూ.5లక్షలకు పెంచారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షల నజరానా ప్రకటించింది. ఎమ్మెల్యే, ఎంపీ నిధుల నుంచి మరో రూ.15లక్షలు అదనంగా కేటాయిస్తామని తెలిపింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నజరానాను పెంచుతుందో లేదో వేచి చూడాలి.

ప్రభుత్వాలపై సన్నగిల్లుతున్న విశ్వాసం..!

ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామపంచాయతీలకు ప్రభుత్వాలు ప్రోత్సాహకం ప్రకటిస్తున్నా.. నిధుల విడుదల్లో చిత్తశుద్ధి చూపడం లేదు. ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకమనేది చాలా ప్రభావితం చేస్తోంది. నిధులు విడుదల చేయకపోవడంతో ప్రభుత్వాలపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని చెప్పక తప్పదు. కాగా ఇదేవిషయమై జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ వివరణ కోరగా, ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకం కోసం పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదించినట్లు ఆయన తెలిపారు.

విచ్చలవిడిగా అక్రమ రవాణా

- అడవిలో యథేచ్ఛగా టేకు చెట్ల నరికివేతలు, జంతువుల వేట, ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని అటవీ శాఖ సిబ్బంది



రామారెడ్డి పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్(ఫైల్)



స్కూల్ తండా శివారులో పోలీసులు పట్టుకున్న టేకు కట్టెలు, ద్విచక్ర వాహనం

రామారెడ్డి: మండలంలో అటవీ శాఖ సిబ్బంది జాడ కనిపించడం లేదా అనే అనుమానాలు ప్రజలకు తలెత్తుతున్నాయి. మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా..టేకు చెట్ల నరికివేతలు కొనసాగుతున్నా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. బైకు నంబర్లను మార్చి ఒక్కో బైకుపై 4 టేక్ దుంగలను తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 8న రాత్రి సమయంలో జగదాంబ తండా దగ్గర పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు బైక్‌పై టేక్ కట్టెలను తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులు తారసపడ్డారు. ఓ వ్యక్తి టేక్ కట్టెలను బైక్‌తో సహా వదిలేసి పరారయ్యాడు. మరో ఐదుగురు వ్యక్తులు బైక్‌పై అడవిలోకి పరారయ్యారు.

పోలీసులే పట్టుకుంటున్నారు..

రామారెడ్డి మండల పరిధిలో రెండు సెక్షన్లున్నాయి. ఒకటి ఖానాపూర్ సెక్షన్, రెండోది రెడ్డిపేట్ సెక్షన్. ఖానాపూర్ సెక్షన్‌లో ఆరు బీట్‌లు, రెడ్డిపేట సెక్షన్‌లో నాలుగు బీట్‌లున్నాయి. ఒక్కో సెక్షన్‌కు సెక్షన్ అధికారి ఉన్నారు. బీట్‌కు ఒకరు చొప్పున మొత్తం 12 మంది అటవీ శాఖ సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం మొత్తం ఏడుగురు సిబ్బంది ఉన్నారు. గతంలో నలుగురు మాత్రమే ఉండేవారు. ఇంత సిబ్బంది ఉన్నా అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత అటవీ శాఖ అధికారులు మర్చిపోతున్నారు. ఆ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే అడవిలోంచి తరలిస్తున్న ఇసుకను, టేకు కట్టెలను వరుసగా పోలీసులే పట్టుకోవడం గమనర్హం. మరోవైపు మండలంలో ఏళ్లుగా జంతువుల వేట, రంగు రాళ్ల రవాణా కొనసాగుతూనే ఉంది. గతంలో సింగరాయపల్లి ఘటన, అన్నారంలో జంతువుల వేట కోసం వినియోగించే పేలుడు పదార్థం ఇంట్లో పేలిన ఘటనలు ఉన్నాయి. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మేల్కొని ఇప్పటికైనా అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని ఇటీవల ఘటనలు ఆశాఖ సిబ్బందికి గుర్తు చేస్తున్నాయి.

బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి



బీబీపేటలో బీసీ వ్యతిరేకుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ నాయకులు

బీబీపేట: బీసీ రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో బీసీ వ్యతిరేకుల దిష్టిబొమ్మను బీసీ సంక్షేమ సంఘం సభ్యులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్రవర్ణాలు ఎలాంటి పోరాటాలు చేయకున్నా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వం.. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడానికి ఎందుకు నిరాకరిస్తోందని మండిపడ్డారు. అన్ని పార్టీలు రిజర్వేషన్లపై డ్రామాలాడుతున్నాయని వ్యాఖ్యానించారు.

అగ్రవర్ణ నేతల కుట్ర

భిక్కనూరు: బీసీ రిజర్వేషన్‌ల జీవోను అడ్డుకోవడం అన్ని పార్టీల అగ్రవర్ణాల నేతల కుట్ర అని భిక్కనూరు మండల బీసీ సంఘం నేత గంగళ్ల రవీందర్ అన్నారు. శనివారం భిక్కనూరులో ఆయన మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్‌లను అడ్డుకోవడం రెడ్డి జాగృతికి తగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనం వల్లనే హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. నేతలు బత్తుల లక్ష్మీనర్సింలు, గజ్జె వేణు తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీకి గుణ పాఠం చెప్పాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు రమేష్ రావు అన్నారు. ఆయన శనివారం తాడ్వాయిలో మాట్లాడారు. న్యాయస్థానంలో నిలబడలేని జీవోతో ప్రజలను మభ్యపెట్టడం దారుణమన్నారు. స్థానిక ఎన్నికల ముంగిట బీసీ రిజర్వేషన్ల అంశాన్ని వాడుకొని ఎన్నికలు వాయిదా వేయాలని కుట్ర పన్నిందన్నారు. కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



నవీపేట: మండల కేంద్రంలోని బాసర రహదారిపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ హెచ్చరించారు. మండల కేంద్రంలోని బాసర క్షేత్రానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను శనివారం పరిశీలించారు. కొన్ని ఆక్రమణలను తొలగించి, మరికొందరికి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం స్థానిక పీఎస్‌లో మాట్లాడారు. ఇరుకుగా ఉన్న బాసర రహదారికి ఇరువైపులా కొందరు వ్యాపారులు స్థలాన్ని ఆక్రమించి ఇష్టానుసారంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలు, ఇష్టానుసారంగా పార్కింగ్‌తో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. బాసరలోని సరస్వతిదేవి దర్శనానికి వెళ్లే భక్తులకు నవీపేటలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే వారాంతపు కూరగాయలు, మేకల సంత ఇదే ప్రాంతంలో జరగడంతో మరింత ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందని అన్నారు. పోలీసులకు సహకరించాలని కోరారు.

బస్సులో గుండెపోటుతో ఒకరి మృతి

మాచారెడ్డి: ఆర్టీసీ బస్సులో గుండె పోటుతో ఒకరు శనివారం మృతి చెందారు. మండలంలోని ఎల్లంపేటకు చెందిన బానోత్ వర్జన్(55) తన భార్య హంసీతో కల్సి డయాలసీస్ కోసం కామారెడ్డికి బస్సులో వెళ్తుండగా పాల్వంచ మర్రి స్టేజీ వద్ద చాతిలో నొప్పి వస్తుందంటూ వర్జన్ బస్సులో ప్రాణాలు వదిలాడు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

వీహెచ్‌పీ నియామకాలు

కామారెడ్డి అర్బన్: విశ్వహిందూ పరిషత్ ప్రాంత సమావేశంలో వివిధ నియామకాలు చేసినట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం తెలిపారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షురాలుగా మంజుల, కామారెడ్డి నగర కార్యదర్శిగా గడ్డమీది అరవింద్, నగర సేవా ప్రముఖ్‌గా కైరా రాజేశ్వర్‌గౌడ్, మాతృశక్తి జిల్లా సంయోజక్‌గా పుష్ప, నగర ధర్మ ప్రసార ప్రముఖ్‌గా స్వామి, నగర సహ సత్సంగ్ ప్రముఖ్‌గా భూమేష్ నియమితులయ్యారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం 42శాతం రిజర్వేషన్లు, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తప్పుడు నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని, ఈ నిర్లక్ష్య ధోరణితో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సుప్రీం కోర్టును ఆశ్రయించి న్యాయపరమైన లొసుగులను సరి చేసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు పూర్తిగా మద్దతు తెలుపుతూ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి

- ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): బీసీలకు 40 శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శనివారం జుక్కల్ క్యాంపు ఆఫీస్ వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని, వార్డు, గ్రామ, మండల స్థాయి కార్యకర్తలు, నాయకులు అన్నివిధాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతీ ఒక్క కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న ఆరోపణలను తిప్పి కొట్టాలని దిశానిర్దేశం చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలతో పాటు సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.

డీసీసీ పదవి ఇవ్వాలని తీర్మానం

నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్‌కు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీర్మానించారు. ఈ మేరకు ఆ తీర్మాన పత్రాన్ని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వద్దకు తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలు తీర్మానంలో పేర్కొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక



వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

బాన్సువాడ : జిల్లా స్థాయి అండర్–14, అండర్–17 వాలీబాల్ పోటీలకు బాలుర జట్లను ఎంపిక చేసినట్లు పీడీ తారాచంద్ తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో విరాట్ (టీడబ్ల్యూ), ప్రణయ్(ఎంజేబీ), అరుణ్(ఎంజేబీ), నవనీత్ (టీడబ్ల్యూ), సోఫియన్ (సింధు), భాను (ఎంజేబీ), చరణ్ (జెడ్పీహెచ్ఎస్, నెమ్లి), రాంచందర్ (టీడబ్ల్యూ), జగదీష్(టీడబ్ల్యూ), అవినాష్ (న్యూటన్స్), అభినవ్(ఎంజేబీ), రేవణ్ (జెడ్పీహెచ్ఎస్, కోనాపూర్, బాన్సువాడ), శరత్ (టీడబ్ల్యూ), రిషి(న్యూటన్స్)లను ఎంపిక చేశారు. అండర్–17 బాలుర విభాగంలో ప్రణీత్‌కుమార్ (ట్రైబల్ వెల్ఫేర్, నస్రుల్లాబాద్), రాహుల్(ట్రైబల్ వెల్ఫేర్, నస్రుల్లాబాద్), వినయ్(ఎంజేబీ, బీర్కూర్), హరికృష్ణ (ఎంజేబీ, బీర్కూర్), రంజిత్ (జెడ్పీహెచ్ఎస్, నెమ్లి), మోహన్, వరుణ్‌సాయి (జెడ్పీహెచ్ఎస్, కోనాపూర్, బాన్సువాడ), అన్వేష్(మోడల్ స్కూల్, బాన్సువాడ), రాకేష్ (మోడల్ స్కూల్, బాన్సువాడ), సూఫియన్, రాంచందర్(సింధు), చిన్న (జెడ్పీహెచ్ఎస్ తిర్మలాపూర్), అఖిలేష్ (ఎంజేబి బీర్కూర్) లను ఎంపిక చేసినట్లు ఆయన అన్నారు.

దోమకొండలో..

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జోనల్ లెవెల్ వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలను నిర్వహించారు. దోమకొండతో పాటు భిక్కనూరు, బీబీపేట మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ ఎంపికలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలుర, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు సాయి మౌర్య, నరసింహారెడ్డి, డాక్టర్ కేపీ అనిల్ కుమార్, రామకృష్ణ, ఆంజనేయులు, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో జోనల్ పోటీల్లో వాలీబాల్ బాలుర జట్టుతో వ్యాయామ ఉపాధ్యాయులు, దాతలు

నస్రుల్లాబాద్: మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో శనివారం బాన్సువాడ జోనల్ లెవెల్ ఎస్‌జీఎఫ్ వాలీబాల్ అండర్–14, 17 బాలబాలికల వన్డే టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాధవ రావు విద్యార్థులను పరిచయం చేసుకుని టోర్నమెంటును పర్యవేక్షించారు. ఎంపికైన వారు ఈ నెల 13న కామారెడ్డిలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

చెట్టుపై నుంచి పడి ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం చెట్టుపై నుంచి పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ శనివారం తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన ప్రేమ్ ఇద్దరు వ్యక్తులతో కలిసి రాంనగర్ కాలనీలోని రామకృష్ణ ఇంటికి చెట్టు కొమ్మలు కొట్టడానికి వచ్చారు. కాగా ప్రేమ్‌తో వచ్చిన ఇద్దరు అడ్డా కూలీల్లో ఒకతను చెట్టు కొమ్మలు కొడుతూ ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కాగా ఇంటి యజమాని క్షతగాత్రుడిని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



బాల్కొండ: మెండోరా మండల శివారులోని కాకతీయ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం శనివారం లభ్యమైనట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. మృతురాలి వయస్సు 55–60 ఏళ్ల వరకు ఉంటుందని, లేత ఆకుపచ్చ చీర, ఎరుపు రంగు జాకెట్టు ధరించి ఉందన్నారు. ఎడమ చేతికి పచ్చబొట్టు ఉందన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 8712659859, 8712659864 నంబర్ల సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

కుటుంబ తగాదాలతో యువకుడి ఆత్మహత్య



సందీప్(ఫైల్)

మోపాల్: కుటుంబ తగాదాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుస్మిత శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మోపాల్ మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన గోదా సందీప్(29) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. రెండు రోజుల క్రితం భార్యతో చిన్నపాటి గొడవ జరిగింది. మనస్తాపంతో క్షణికావేశానికి గురైన సందీప్ శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో డిష్ వైర్‌తో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

డొంకేశ్వర్: మండలంలోని మారంపల్లిలో పేకాట స్థావరంపై పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. ఊరి బయట రేకుల షెడ్డులో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకోగా వారి నుంచి రూ.5,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామ్ తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

గోదావరిలో ఒకరి గల్లంతు

- బావమరిది మృతదేహం కోసం గాలిస్తుండగా బావ గల్లంతు



గంగాధర్(ఫైల్)

బాల్కొండ: మెండోరా మండలం చాకిర్యాల్ శివారులోని గోదావరి నదిలో ఆర్మూర్ మండలం చేపూర్‌కు చెందిన కనికరపు గంగన్న(45) శనివారం గల్లంతయ్యాడు. మెండోరా ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. చేపూర్‌కు చెందిన గంగన్న తన బావమరిది జొరిగె గంగాధర్ కొన్ని రోజుల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటానని ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈ క్రమంలో ఆయన స్కూటీ చాకిర్యాల్ గోదావరి సమీపంలో కనిపించింది. దీంతో ఇక్కడే పడి ఆత్మహత్య చేసుకుని ఉంటారని భావించిన గంగన్న శనివారం కొంత మంది బంధువులతో కలిసి వచ్చి గోదావరిలోకి గాలింపు చర్యలు చేపట్టారు. గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గంగన్న నీటిలో మునిగి కొట్టుకుపోయాడు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం

బోధన్‌రూరల్: మండలంలోని భూలక్ష్మి క్యాంప్ గ్రామానికి చెందిన లోకిరెడ్డి సాంబరెడ్డి అనే వ్యక్తి అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి శనివారం తెలిపారు. గ్రామంలో హోటల్ వ్యాపారం చేసుకుంటు జీవిస్తున్న సాంబరెడ్డి శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. చేసిన అప్పులు బాగా పెరిగిపోవడంతో మనోవేదనకు గురై ఇంటి నుంచి వెళ్లిపోయి ఉంటాడని కుటుంబీకులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెంజల్‌లో వివాహిత..

రెంజల్: మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ శనివారం తెలిపారు. గత నెల 16న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. వివాహిత భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి ఒకరి మృతి

మాచారెడ్డి: ఈతకు వెళ్లి ఓ యువకుడు నీట మునిగి మృతి చెందిన ఘటన శనివారం పాల్వంచ మండలం ఫరీద్ పేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షాదుల్ (40) స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని ముల్లోని చెరువుకు ఈతకు వెళ్లాడు. ఈత కొట్టుకుంటూ చెరువు మధ్యలోకి వెళ్లగానే ఊపిరి తీసుకోవడం కష్టమై నీట మునిగాడు. వెంటనే స్నేహితులు ఒడ్డుకు చేర్చి ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

రెండు కేసుల్లో ఆరుగురి రిమాండ్

బోధన్‌టౌన్: బోధన్ పట్టణ పీఎస్ పరిధిలోని రెండు చోరీ కేసుల్లో ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. శనివారం రాత్రి పట్టణ పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని ఓ ఇంటి తాళం పగుల గొట్టి చోరీకి పాల్పడిన బోధన్‌కు చెందిన రాజేందర్ సింగ్, సాజన్ సింగ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి చోరీ చేసిన సొత్తును రికవరీ చేశామన్నారు. అలాగే బెల్లాల్ కిరాణ దుకాణం తాళం పగుల గొట్టి రెండు గ్యాస్ సిలిండర్లు చోరీకి పాల్పడిన మోస్రాకు చెందిన రావుల నాగరాజు, బండి తరుణ్, హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్, వర్నికి చెందిన హన్మాండ్లును అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ రెండు కేసుల విచారణకు కృషి చేసిన ఎస్సైలు భాస్కరాచారి, హబీబ్‌ఖాన్, సిబ్బందిని ఏసీపీ శ్రీనివాస్ అభినందించారని సీఐ తెలిపారు.

బంగారం దొంగిలించిన వ్యక్తి..

ధర్పల్లి: బంధువులమని పరిచయం చేసుకొని వృద్ధురాలి నుంచి బంగారం దొంగిలించిన వ్యక్తిని శనివారం పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భిక్షపతి తెలిపారు. ధర్పల్లి పీఎస్‌లో కేసు వివరాలను సీఐ వెల్లడించారు. ధర్పల్లికి చెందిన కురి లక్ష్మి అనే వృద్ధురాలు ఈనెల 1న ధర్పల్లి పాత బస్టాండ్ సమీపంలోని టీ షాప్ వద్ద కూర్చొని ఉండగా కామారెడ్డికి చెందిన గడీల బైరయ్య, కురి లక్ష్మి వద్దకు వెళ్లి బంధువులమని చెప్పి ఆమె వద్ద ఉన్న బంగారం చెవి కమ్మలు తీసుకొని పారిపోయారు. వృద్ధురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడు బైరయ్య పై కామారెడ్డి జిల్లాలో పలు కేసులు ఉన్నట్లు వెల్లడించారు. కేసును త్వరగా చేధించిన ఎస్సై కళ్యాణి, కానిస్టేబుల్ ప్రసాద్, సంతోష్‌లను సీఐ అభినందించారు.